క్లుప్తంగా

అనుబంధ కమిటీల్లో జిల్లా నాయకులకు చోటు

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్‌ జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో నియమించారు. వైఎస్సార్‌ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కేసరి శివారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్‌ వింగ్‌ ప్రధాన కార్యదర్శిగా ముక్కపాటి నరసింహారావు, రాష్ట్ర మైనార్టీ సెల్‌ కార్యదర్శులుగా డాక్టర్‌ రెవరెండ్‌ సందీప్‌, కలపాల అజయ్‌కుమార్‌ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది.

బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటుకు డిమాండ్‌



గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): దేశంలో బీసీ కులాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్‌ కేంద్రాన్ని డిమాండ్‌ చేశారు. గాంధీనగర్‌ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా షేక్‌ నాగుల్‌ మీరాను నియమించి ఆయనకు నియమాకపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా లాకా వెంగళరావు యాదవ్‌ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా బీసీల జీవితాలలో మార్పు రాలేదన్నారు. తమిళనాడులో బీసీల ఐక్య పోరాట ఫలితంగా 69శాతం రిజర్వేషన్లు సాధించారని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్‌ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని, దేశవ్యాప్తంగా కులగణనతోపాటు బీసీ కులగణను కూడా చేపట్టాలని కోరా రు. బీసీల రక్షణ కోసం వెంటనే చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. నాగుల్‌ మీరా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వెంగళరావు యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బీసీ సంఘం నేతలు కలిసి నాగుల్‌ మీరాను సత్కరించారు.

మార్గదర్శకులు పూలే

పెనుగంచిప్రోలు: అందరికీ సమాన హక్కులు కావాలని పోరాడిన వ్యక్తి దివంగత మహాత్మా జ్యోతిరావుపూలే అని వైఎస్సార్‌ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ అన్నారు. పూలే జయంతి సందర్భంగా వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర బీసీ సెల్‌ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యులు చాట్ల సుశీల, కీసర లోకేశ్వరరావు, నియోజకవర్గ ట్రేడ్‌ యూనియన్‌ అధ్యక్షుడు మెండెం రామారావు, మార్కెట్‌ యార్డు మాజీ డైరెక్టర్‌ తమ్మిశెట్టి సోమయ్య, నాయకులు కాకాని హరి, ఉన్నం శ్రీనివాసరావు, బొడ్డు రవి, చేని రాంబాబు, జక్కులూరి దేవదాసు, నలబోతు నాగబాబు, తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్‌ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఎంపీడీఓ జి.శ్రీను, ఏపీఓ జనార్ధన్‌, ఏఓ సిద్దారెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమ సమాజం కోసం ఉద్యమించిన స్ఫూర్తి ప్రదాత, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని వైఎస్సార్‌ సీపీ ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ కొనియాడారు. జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌ సీపీ నేతలు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. అనంతరం అవినాష్‌ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి చదువు ఒక్కటే మార్గమని భావించిన మహనీయుడు పూలే అన్నారు. పూలే, అంబేడ్కర్‌ల ఆశయాలు, ఆలోచనలను చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్‌ సిక్స్‌ హామీలను తుంగలో తొక్కి డైవర్షన్‌ పాలిటిక్స్‌ను నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. 'చెప్పాడంటే..చేస్తాడంతే' అనేమాట మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే వర్తిస్తుందని పేర్కొన్నారు.

సామాజిక న్యాయానికి నాంది...

సామాజిక న్యాయానికి నాంది పలికిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే కాగా, ఆయన స్ఫూర్తితో పాలన సాగించిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్‌ పేర్కొన్నారు. పూలే ప్రేరణతో మాజీ సీఎం వైఎస్‌ జగన్‌ బీసీ డిక్లరేషన్‌ ప్రకటించి అమలుచేశారని ఆయన గుర్తుచేశారు. విజయవాడ నగర మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పూలే ఆశయాలకనుగుణంగా వైఎస్‌ జగన్‌ పాలన సాగించారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేసిందన్నారు. పత్రికా స్వేచ్ఛకు చంద్రబాబు ప్రభుత్వం సంకెళ్లు వేసిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యులు షేక్‌ ఆసిఫ్‌, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజరెడ్డి, నాయకులు కాలే పుల్లారావు, బూదాల శ్రీను, పోలిమెట్ల శరత్‌, తోలేటి శ్రీకాంత్‌, జమల పూర్ణమ్మ, విద్యార్థి నాయకుడు రవిచంద్ర, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్‌, గుండె సుందరపాల్‌, దేరంగుల రమణ, జి.నవీన్‌, పిళ్లా సూరిబాబు, మజ్జి శ్రీను పాల్గొన్నారు.



పూలే విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతున్న దేవినేని అవినాష్‌, పక్కన అరుణకుమార్‌, విష్ణు

పూలే ఆశయాల సాధనలో ముందుకు పోదాం

మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్‌: 190 ఏళ్ల క్రితమే సమాజంలో సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించిన మొదటి సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పూలే జయంతి వేడుకలు పట్టణంలో శుక్రవారం వైఎస్సార్‌ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ రోడ్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి తన్నీరు నాగేశ్వరరావు బీసీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే ఆలోచన విధానాన్నే మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో కార్యాచరణలో పెట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్‌, మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, రాష్ట్ర ఎస్టీ విభాగం నాయకుడు బద్దూనాయక్‌, జిల్లా కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, నాగబాబు, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ హఫీజున్నీసా ఫిరోజ్‌, మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్‌ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుశీల, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్‌, పట్టణ కార్మిక, ప్రచార విభాగాల అధ్యక్షులు వినోద్‌కుమార్‌, వెంకయ్య, పట్టణ యూత్‌ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్‌, తిరుమలగిరి దేవస్థానం కమిటీ సభ్యుడు దర్శి వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సీ సెల్‌ నాయకుడు ఉప్పెల్లి పెంటయ్య, మారిశెట్టి అనిల్‌, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: మహాత్మా జ్యోతీరావ్‌ పూలే జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, శుక్రవారం జరుపుకున్నారు. కంచికచర్ల కేవీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ టెక్నాలజీ కళాశాలలో కవి, రచయిత తంగిరాల సోనీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ జ్యోతిరావ్‌పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల అధినేత కేవీ కృష్ణారావు మాట్లాడారు. మండలంలోని గండేపల్లి, వేములపల్లి, ఎస్‌ అమరవరం, పరిటాల తదితర గ్రామాల్లో జ్యోతీరావు పూలే జయంతి జరుపుకున్నారు. సర్పంచులు బీ రవికుమార్‌, కోదాటి సీతారం, యద్దనపూడి ఆనందజ్యోత్స్న, కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ కే లక్ష్మి, కర్ల రవికుమార్‌, పిల్లి స్వామిదాసు, పుల్లారావు, చట్టి రవీంద్ర, కోదాటి మన్మధరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ టౌన్‌: మహాత్మా జ్యోతీరావు పూలే అన్ని వర్గాలకు చెందిన ప్రజా నాయకుడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీ సెంటరు పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైస్‌ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, పట్టణ కన్వీనర్‌ మహ్మద్‌ మస్తాన్‌, రైతు కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరుమామిళ్ల శ్రీనివాసరావు, నాయకులు పెసరమల్లి స్టాలిన్‌, పెర్మసాని నరసింహారావు, తోట అంజారావు, పోతురాజు, మార్త శ్రీను, ఓర్సు కొండ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో..

నందిగామ రూరల్‌: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మహాత్మాజ్యోతీరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మండవ కృష్ణకుమారి, పలువురు నాయకులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో నాయకులు సీతారామయ్య, కేదార్‌నాథ్‌శర్మ, తులసీకృష్ణ, లక్ష్మణ్‌, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు: మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో శుక్రవారం పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ జిల్లా నాయకుడు మంద పిచ్చయ్య మాదిగ, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలు సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో..

జగ్గయ్యపేట అర్బన్‌: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పట్టణంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో..

బీసీ సంఘాల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దేవరకొండ శ్రీను, పేట నియోజకవర్గ అధ్యక్షుడు సత్యశేఖర్‌, పట్టణ మహిళా అధ్యక్షురాలు సులోచన, న్యాయసలహాదారుడు మెట్టెల ఆంజనేయులు, బీసీ సమన్వయకమిటీ నియోజకవర్గ చైర్మన్‌ గుమ్మా చంద్రశేఖర్‌, సంఘ నాయకులు కుంభం వెంకట్‌, కృష్ణమాచారి, వేల్పుల రత్నం, చారి పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బీఎస్పీ ఆధ్వర్యంలో జ్యోతిరావ్‌ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. విజయవాడ రోడ్‌లోని పూలే విగ్రహానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ కొదమల ప్రభుదాసు ఆ పార్టీ నేతలతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేవీ.రత్నం, నాయకులు కె.రాజశేఖర్‌, కె.రాహుల్‌, సీహెచ్‌.రమణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



పేటలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు, నేతలు



నందిగామ సెంటరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెనుగంచిప్రోలులో పూలే జయంతి వేడుకల్లో ఎంపీపీ గాంధీ, రామారావు తదితరులు

కార్పొరేషన్ల ద్వారా చెక్కుల పంపిణీ

గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌):మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టర్‌ డాక్టర్‌ లక్ష్మీశ శుక్రవారం వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేశారు. పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌ లక్ష్మీశ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల ప్రజల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్పొరేషన్ల తరఫున లబ్ధిదారులకు సబ్సిడీపై రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్పొరేషన్ల నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు 400 మంది లబ్ధిదారులకు రూ.8.05కోట్ల ఆర్థికసాయం అందించినట్లు వివరించారు. లబ్ధిదారులు ఆటోలు, చిరు వ్యాపారాలు, జనరిక్‌ మెడికల్‌ షాపులు నిర్వహించుకునేందుకు వెనుకబడిన సంక్షేమశాఖ ద్వారా ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయనున్నట్లు కలెక్టర్‌ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్‌ పరిపాలన అధికారి శ్రీనివాసరెడ్డి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి. కె.లక్ష్మీదేవమ్మ, సహాయ సంక్షేమ అధికారి పి.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్‌ ఏఇవో కె.రాజేంద్రబాబు, హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్లు రజనీకుమారి, హేమప్రియ, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న కలెక్టర్‌ డాక్టర్‌ జి.లక్ష్మీశ

అమ్మవారి సాక్షిగా న్యాయమే గెలుస్తుంది : తన్నీరు

పెనుగంచిప్రోలు: శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి సాక్షిగా న్యాయం, ధర్మం ఎప్పటికైనా గెలుస్తాయని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. తిరునాళ్లలో ఘర్షణ నేపథ్యంలో 16మంది వైఎస్సార్‌ సీపీ సానుభూతిపరులపై పోలీసులు నమోదు చేసిన అక్రమకేసులో పదిమందికి శుక్రవారం బెయిల్‌ మంజూరైంది. బెయిల్‌పై విడుదలైన వారితో కలిసి తన్నీరు నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి పెనుగంచిప్రోలులోని టౌన్‌ సెంటర్‌లో ఉన్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి, మహానేత వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ పసుపు-కుంకుమ బండ్ల కార్యక్రమంలో ఘర్షణకు సంబంధించి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై మాత్రమే కేసులు నమోదు చేశారన్నారు. ఈ ఘటనకు కారకులైన టీడీపీ వారిపై ఎటువంటి కేసు నమోదు చేయకపోవడం శోచనీయమన్నారు. టీడీపీవారే మొదట రెచ్చగొట్టే పాటలు, డైలాగ్‌లతో వైఎస్సార్‌ సీపీకి చెందిన వారిపై రాళ్లు, బాటిళ్లు, చెప్పులు విసిరిన వైనానికి తిరునాళ్లకు వచ్చిన జనమే సాక్ష్యమని గుర్తుచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంటే కేవలం వైఎస్సార్‌ సీపీ వర్గీయులపైనే అక్రమంగా కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజమన్నారు. ప్రస్తుతం వేల్పుల అజయ్‌కుమార్‌, జొన్నలగడ్డ శ్రీహరి, శివరాంభొట్ల నాగ వెంకటేష్‌, చేని మహేష్‌, పసుపులేటి వరుణ్‌కుమార్‌, దారా గౌతమ్‌, సందిపాము సవన్‌కుమార్‌, దాసరి నాగబాబు, కాకాని సంజయ్‌, షేక్‌ మస్తాన్‌వలికి బెయిల్‌ వచ్చిందన్నారు. మిగిలినవారికి కూడా త్వరలోనే బెయిల్‌ వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అందరికీ బెయిల్‌ వచ్చాక వెళ్లి తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులందరికీ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మార్కపూడి గాంధీ, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, నియోజకవర్గ వాణిజ్య విభాగం, ట్రేడ్‌ యూనియన్‌ అధ్యక్షులు దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, జిల్లా బీసీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, నాయకులు కాకాని హరి, యానాల సురేష్‌, పొన్నం వెంకటేశ్వరరావు, ఉన్నం శ్రీనివాసరావు, నంబూరి రవి, శివరాత్రి పృథ్వీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరునాగేశ్వరరావు, పక్కన ఎంపీపీ మార్కపూడి గాంధీ

క్లుప్తంగా

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక పాల కేంద్రంలో పాలు పోసే పాడి రైతులకు శుక్రవారం బోనస్ పంపిణీ చేశారు. మొత్తం 125 మంది రైతులకు రూ.3.10 లక్షల బోనస్ అందజేసినట్టు పాలకేంద్రం చైర్మన్ కొత్తపల్లి రామనాథం అన్నారు. వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, కేంద్రం కార్యదర్శి రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవసరం

పెనుగంచిప్రోలు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పెనుగంచిప్రోలు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. పోషకాహార పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, లింగగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆహారం తీసుకునే ముందు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించారు. పోషకాహార విలువలు తెలియజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలకు 739 మంది హాజరు

నందిగామ టౌన్: పట్టణంలోని బాబూజగ్జీవన్ రామ్ భవన్‌లో ఆయా కార్పొరేషన్‌ల దరఖాస్తుదారులకు బ్యాంకు అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రమణబాబు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణంలో మొత్తం 1,304 మంది దరఖాస్తు చేసుకోగా 739 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిలువమార్గం

నందిగామ రూరల్: సమస్త మానవాళి కోసమే జీసెస్ సిలువపై తన రక్తాన్ని చిందించారని సిలువగిరి విచారణ ఫాదర్ రెవరెండ్ ఫిల్లోమన్ రాజ్ పేర్కొన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు గ్రామంలో శుక్రవారం భక్తిగీతాలు ఆలపిస్తూ సిలువమార్గం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభువు ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. సంఘ కాపరి మరియన్న, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి



జగ్గయ్యపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



కంచికచర్లలో ఇన్‌చార్జి తహసీల్దార్ మానసకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

తహసీల్దార్‌లకు వినతిపత్రాల అందజేత

జగ్గయ్యపేట: జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే, జగ్గయ్యపేట ప్రెస్‌క్లబ్ పాత్రికేయులు పట్టణంలోని తహసీల్దార్ మనోహర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ సాక్షి దినపత్రిక సంపాదకులు ధనంజయరెడ్డి, మరో ఆరుగురు పాత్రికేయులపై ప్రభుత్వం అక్రమంగా కేసులు నమోదు చేయటం బాధాకరమన్నారు. ఈ చర్యలు భావప్రకటన స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని తెలిపారు. ఈ చర్యలను ఖండించారు. అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు టీఎల్ఎన్ ఆచార్యులు, శివాజీ, సాంబశివరావు, నాయుడు, శ్రీనివాసరావు, శేషు, నజీర్, ప్రసాద్, కట్టా గురవయ్య, ఎస్ఎస్ శ్రీనివాసరావు, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

నిజాలను రాస్తున్న జర్నలిస్టులపై కేసులా?

కంచికచర్ల: నిజాలను నిర్భయంగా ప్రజలకు తెలియజేస్తున్న సాక్షి ఎడిటర్ ధనంజయ్‌రెడ్డి, రిపోర్టర్లపై ప్రభుత్వం అన్యాయంగా కేసులు పెట్టటం హేయమైన చర్య అని, దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని సీనియర్ జర్నలిస్టులు తోట ప్రసాద్, షేక్ హఫీజుల్లా, తంగిరాల సోనీ పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు పెట్టినందుకు నిరసనగా శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వేమూరి మానసకు కంచికచర్ల జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు రెడ్‌బుక్ అరాచకాలను వెలుగులోకి తెస్తున్న సాక్షి పత్రికపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెగబడుతోందని అన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా చూడాల్సిన ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అమర్లపూడి అజయ్, బచ్చు వెంకటేశ్వరరావు, వెలగలేటి కృష్ణంరాజు, అయిలపోగు రవికుమార్, బీ ప్రభాకర్, తోట వెంకట నరసింహారావు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు సన్మానం



అనుబంధసంఘాల అధ్యక్షులను సన్మానిస్తున్న తన్నీరు తదితరులు

వత్సవాయి: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగలకు అధ్యక్షులుగా నియమితులైన పలువురుకి శుక్రవారం సన్మాన కార్యక్రమాలను నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు నిర్వహించారు. నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడిగా కనగాల రమేష్, యూత్ అధ్యక్షుడిగా నరమనేని వెంకటేష్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ రబ్‌హుస్సేన్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులుగా వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఆర్టీఐ విభాగం వాసిరెడ్డి కృష్ణారావు, బూత్ కమిటీ విభాగం అధ్యక్షులుగా లేళ్ల నాగేంద్రరెడ్డి, వలంటీర్ కమిటీకి రెంటాల నాగభూషణం, దివ్యాంగుల కమిటీ విభాగం అధ్యక్షులుగా పూర్ణకంటి బాబురావు అదేవిధంగా జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షులుగా కుక్కల శ్రీధర్, కార్యదర్శిగా శీలం మంగారావుఅను తన్నీరు పూలమాలలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ నామస్మరణం చేయడమే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు మిట్టకోలు నరేష్, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, దబ్బాకుపల్లి సర్పంచ్ కొట్టు నగేష్, ముస్లిం సంఘ నాయకులు షేక్ బాజీ, మండల పార్టీ నాయకులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, సాగర్, కర్నాటి నారాయణరెడ్డి, గుగులోతు శ్రీనునాయక్, వడ్లమూడి రాజేష్, అయినాల తిరుపతిరావు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజల్లో అధికారులు, అర్చకులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): స్థానిక వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి వారు పెండ్లి కుమారుని అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పరాంకుశం వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో స్వామి వారికి నిత్య పూజలు, అలంకరణలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. 41 రోజుల పాటు మాల దీక్ష స్వీకరించిన స్వాములు ఇరుముడులు సమర్పించారు. రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ మూర్తిలు అన్నదానానికి రూ.1.25 లక్షలను ఆలయ ఏసీ వరప్రసాద్‌కు అందజేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో తీర్చిదిద్దారు.

నేడు కల్యాణం..

శనివారం రాత్రి తొమ్మిది గంటలకు కొండ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కల్యాణం జరగనుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కల్యాణోత్సవానికి రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలతో పాటు రెండుతెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నారు.

చెక్కులు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యానికి గురై ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వత్సవాయి మండలానికి చెందిన పలువురికి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శుక్రవారం అందజేశారు. భీమవరం గ్రామానికి చెందిన సుగంధపు నాగమణికి రూ.20 వేలు, షేక్ షఫియాకు రూ.20 వేలు, సంగెపు శ్రీరామ్‌కు రూ.35 వేలు, పగడాల శేఖర్‌కు రూ.21,947, చెన్నంశెట్టి శ్రీకాంత్‌కు రూ. 10,30,59, పెంటి జయశ్రీకి రూ.25,614 వంతున మొత్తం రూ.2 లక్షల 25 వేల, 647 విలువైన చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు.

కనుల పండువగా సత్యమ్మ జాతర



నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం సత్యమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. సువర్ణ పుష్ప ఖడ్గమాల, అర్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, సామూహిక కుంకుమార్చనలు ఘనంగా చేశారు. అనంతరం అమ్మవారికి లక్ష మల్లెలార్చన, అష్టోత్తర సహస్ర నామ పూజలు నిర్వహించారు. చండీ సహిత రుద్ర హోమం, గణపతి హోమం, వేదపారాయణ కార్యక్రమాలను వేదోక్తంగా జరిపించారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్, ఉత్సవ కమిటీ సభ్యుడు మంచాల మాధవరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్



ట్యాంకు వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

తిరుమలగిరి(జగ్గయ్యపేట): మండలంలోని తిరుమలగిరి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉండటంపై శుక్రవారం 'తిరుమలగిరిలో అధ్వాన్నంగా పారిశుద్ధ్యం' వార్త సాక్షి ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు గ్రామంలోని డ్రెయిన్లలో పూడిక తీయటంతో పాటు మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటి ట్యాంకు వద్ద చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో గ్రామస్తులు సాక్షి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఎంఈవోకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో చిట్టిబాబు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు చల్లా దుర్గ వైకుంటరావు ఆయనను కలిసి ప్రభుత్వం పాఠశాలల మార్పులో భాగంగా గ్రామంలోని పాఠశాలను తొలగించాలని చూస్తుందని ఆ ఆలోచనను విరమించుకునేలా చూడాలని కోరారు. తరగతులను మారిస్తే గ్రామంలోని విద్యార్థులు అవస్థలు పడతారని చెప్పారు. దీనిపై ఎంఈవో మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కీసర(కంచికచర్ల): మండలంలోని కీసర విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఈనెల 12న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కృష్ణారావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గండేపల్లి, కీసర, పెండ్యాల, వేములపల్లి, శౌరీ అమరవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ అన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

వత్సవాయి : పౌష్టికాహారంతో వ్యాధులు దరిచేరవని ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో కె.నాగమణి తెలిపారు. శుక్రవారం మక్కపేట, పోలంపల్లి, వత్సవాయి, పెద్దమోదుగపల్లి, మంగొల్లు, భీమవరం గ్రామాలలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలని చెప్పారు. నివాస ప్రాంతాలమధ్య మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పాలు, గుడ్లు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీబీజాన్, సర్పంచ్ ఎం.లాజర్, వైస్ ఎంపీపీ కాటేపల్లి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూమికి కౌలు హక్కులకు వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయ సమీపంలోని బాలాజీ సత్రం వద్ద జగ్గయ్యపేట పట్టణంలోని రంగనాయక స్వామి వారి ఆలయానికి చెందిన భూమికి శుక్రవారం బహిరంగ కౌలు హక్కులకు వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.60 వేలు ఆదాయం వచ్చిందని రంగనాయక స్వామి వారి ఆలయ ఈవో జయప్రకాష్‌బాబు పేర్కొన్నారు. గ్రామంలోని రంగనాయక స్వామి వారికి చెందిన 8.20 ఎకరాల భూమి ఉందని, ఈ భూమి గత వందేళ్లుగా గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా సాగు చేసుకుంటున్నారన్నారు. దీంతో 2009లో భూమి తమదని వ్యక్తి కోర్టును ఆశ్రయించటంతో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. 2018లో కోర్టు దేవస్థానం ఆధీనంలోకి తీసుకోవాలని తీర్పు ఇవ్వటంతో ఇటీవల భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకం అడంగల్ రావటంతో కౌలు వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్ కళ్యాణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

65 మందికి వైద్య పరీక్షలు

నందిగామ రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని ఆయుర్వేద వైద్యుడు కొప్పుల కృష్ణమోహన్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని సోమవారం గ్రామంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం ప్రభావవంతంగా పని చేస్తుందన్నారు. ఇటీవల కాలంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. అనంతరం 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉప్పుకొండూరు గురుప్రసాద్, బెల్లం కోటేశ్వరరావు, జంగాల శ్రీనివాసరావు, శ్యాంప్రసాద్, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిమ కలిగిన చల్లని తల్లి.. సత్యమ్మ తల్లి..



అంబారుపేట గ్రామంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం



అంబారుపేట గ్రామంలో సత్యమ్మ అమ్మవారు

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి. భక్తుల కొంగు బంగారంగా నిత్య పూజలందుకుంటూ విరాజిల్లుతున్నారు. మహిమ కలిగిన చల్లని తల్లిగా.. విజయాలను అందించే విజయ లక్ష్మిగా అమ్మవారు ప్రసిద్ధి. అమ్మవారికి ప్రతిఏటా ఆషాఢమాసంలో శాకంబరీ ఉత్సవాలు, దసరా పండుగ సందర్భంగా శరన్నవరాత్రి వేడుకలు, శ్రావణ మాస పూజలతో పాటు చైత్రమాసంలో సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతర మహోత్సవాలను ఐదు రోజుల పాటు వేదోక్తంగా జరిపించటం ఆనవాయితీగా వస్తోంది.

నిత్య పూజలు.. హోమాది క్రతువులు..

సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు చండీ సహిత రుద్ర హోమం, గణపతి హోమం, వేద పారాయణ కార్యక్రమాలను వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా జరిపిస్తారు. మహోత్సవాలలో బోనాల సమర్పణ, ప్రభ బండ్ల ఊరేగింపు, అమ్మవారి రథోత్సవానికి విశిష్ట ప్రాధాన్యత ఉంటుంది. ఏ ఉత్సవం జరిగినా అమ్మవారి ఆలయం పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతుల వెలుగులతో శోభాయమానంగా దర్శనమిస్తోంది.

సత్యమ్మ అమ్మవారి ఆలయ చరిత్ర..

చంద్రగిరి మహారాజు పాలించే కాలంలో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్న సమయంలో మొఘలులతో జరిగిన యుద్ధ పరిస్థితులలో నందిగామ ప్రాంతానికి చంద్రగిరి మహారాజు వచ్చినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఆ సమయంలో విడిది కోసం అంబరీలతో ఉన్న ఏనుగులతో ఈ ప్రాంతానికి వచ్చారని, అందువలనే ఈ ప్రాంతానికి అంబారుపేట అనే పేరు వచ్చిందని పెద్దలు ఇప్పటికీ చెబుతుంటారు. ఇక్కడ వెలసిన సత్యమ్మ అమ్మవారిని చంద్రగిరి మహారాజు మొఘలులతో జరుగుతున్న యుద్ధంలో విజయాన్ని అందించాలని మొక్కుకోవటంతో అమ్మ కరుణ వలనే విజయం సాధించారని మరొక చారిత్రక కోణం చెబుతోంది.

చింత చెట్టు కింద బాట సత్యమ్మగా..

గ్రామంలోని చింతచెట్టు కింద 200 ఏళ్ల క్రితం అమ్మవారు శిలగా వెలిశారని, అమ్మవారు వెలిసిన ప్రాంతం కాలిబాట కావటంతో బాటసారులు అమ్మవారిని బాట సత్యమ్మ అమ్మవారిగా కొలిచే వారని నానుడి. కాలక్రమంలో బాట సత్యమ్మ తల్లి అంబారుపేటలో వెలిసిన సత్యమ్మ అమ్మవారిగా అవతరించారు. అంబారుపేట గ్రామంలో భక్తుల సహకారంతో 1956లో గుడి నిర్మాణం చేసి 1987లో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. మరలా 2008లో అంబారుపేట గ్రామ ప్రజల సహకారంతో దేవాలయాన్ని పునర్నిర్మించి అమ్మవారిని పునః ప్రతిష్ఠించారు. నాటి నుంచి అమ్మవారికి తలనీలాలు ఇచ్చి, పాల పొంగళ్లను నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అమ్మవారి ప్రాశస్త్యం రెండు తెలుగు రాష్ట్రాలకు వ్యాపించింది. దీంతో పాటు 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఆలయం ఉండటంతో రాకపోకలు సాగించే వారు అమ్మవారిని దర్శించుకుని వెళ్తుండటంతో భక్తుల ఆదరణ క్రమంగా పెరుగుతోంది.